పెద్దచెరువు వద్ద ఏర్పాట్లపై సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

# గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి

గణేశ్ నిమజ్జన కేంద్రాలు, ఊరేగింపు నిర్వహించే రూట్ల పరిశీలన

రాంనగర్/ మానకొండూర్, సెప్టెంబర్ 11: రాబోయే గణేశ్ నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిమజ్జన ప్రదేశాల్లో పకడ్బందీ చర్యలు చేపట్టాలని కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయా డివిజన్ల ఏసీపీలు, ఇతర పోలీస్ అధికారులతో కలిసి నిమజ్జన కేంద్రాలైన చింతకుంట కెనాల్, కొత్తపల్లి, మానకొండూర్ చెరువులను సందర్శించారు. విగ్రహాల ఊరేగింపు రూట్లను పరిశీలించారు. ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని హిందుపూర్ కాలనీ, గాంధీరోడ్, రాజీవ్‌చౌక్, టవర్ సర్కిల్, పాతశివాలయం, నంబర్‌వన్ వినాయక మండపం, కమాన్ చౌరస్తాతో పాటు పలు వినాయక మండపాలు ఏర్పాటు చేసిన ప్రాంతాలలో పర్యటించారు. కార్యక్రమంలో ఏసీపీలు శ్రీనివాస్ (ఎస్బీ) నరేందర్(కరీంనగర్ టౌన్), వెంకటరమణ (కరీంనగర్ రూరల్), ఎస్బీ సీఐలు సృజన్‌రెడ్డి, శ్రీనివాస్, కరీంనగర్ వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, తిమ్మాపూర్ సీఐలు సరిలాల్, విజయ్‌కుమార్, జాన్‌రెడ్డి, స్వామి, ప్రదీప్ కుమార్, కొత్తపల్లి సాంబమూర్తి పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే రౌడీషీట్లు

సీపీ అభిషేక్ మొహంతి

వీణవంక, సెప్టెంబర్ 11: శాంతిభద్రలతకు భంగం కలిగించే వారిపై చర్యలు తప్పవని, రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి సూచించారు. బుధవారం వీణవంక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పెండింగ్ కేసులపై సమీక్ష చేసి, వాటికి గల కారణాలను అడిగి తెలుసుకొని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ విసిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి చూపుతూ స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శించాలని సూచించారు. ఠాణా పరిధిలోని గ్రామాల్లో వీధి రౌడీలుగా చలామణి అవుతూ గ్రూపులుగా ఏర్పడి, సామాన్య ప్రజలను బెదిరించే వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేయాలని, రౌడీషీటర్లు, హిస్టరీ షీట్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని ఆదేశించారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ హోల్స్‌గా గుర్తించి, నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి రవాణా, అక్రమ ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం, పేకాట స్థావరాలను గుర్తించి కేసులు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ తోట తిరుపతి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 'బండి' ఇంకెన్నాళ్లో ఉత్తమాటలు?

- దమ్ముంటే సిరిసిల్లలో రూ.10 కోట్లతో నిప్ట్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయించు
- కేంద్రమంత్రి సంజయ్‌కి కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సవాల్

మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

రాంనగర్, సెప్టెంబర్ 11: ' కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ప్రజలను మభ్యపెడుతున్నడు. పనులు కావాలి. ప్రాజెక్టులు కావాలంటూ బీజేపీ ప్రభుత్వ పెద్దలకు ఉత్తుత్తి వినతి పత్రాలు ఇస్తూ, ఇటు ప్రజలకు ఉత్తుత్తి మాటలు చెబుతూ మోసం చేస్తున్నడు. ఇలా ఇంకెన్నాళ్లూ మభ్య పెడతావ్' అంటూ కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు మండిపడ్డారు. బుధవారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోడీ తన నియోజకవర్గమైన వారణాసిలో అదనంగా చేనేత కార్మికుల సంక్షేమం కోసం నిప్ట్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ) ఎక్స్ టెన్షన్ సెంటర్‌ను రూ.10 కోట్లతో ఏర్పాటు చేయించుకున్నారని, అదే మాదిరిగా రూ.10కోట్లతో మరో నిప్ట్ ఎక్స్ టెన్షన్ సెంటర్‌ను సిరిసిల్లలో ఏర్పాటు చేయించే దమ్ము సంజయ్‌కు ఉందా..? అని ప్రశ్నించారు. సిరిసిల్ల చేనేత కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా ఏదో ఉత్తుత్తి వినతి పత్రాలు ఇచ్చుకుంటూ మభ్య పెట్టడం బంద్ చేయాలని సూచించారు. ఇటీవల టెక్స్ టైల్ మంత్రి గిరిరాజ్ కిశోర్‌కు సిరిసిల్లలో మెగా క్లస్టర్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇచ్చినట్లు మీడియాలో చూశానని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిరిసిల్లకు మంజూరైన మెగా క్లస్టర్ వరంగల్‌కు తరలిపోతే కండ్లు అప్పగించి చూసింది మీరు కాదా..? అని ప్రశ్నించారు. కేంద్రమంత్రికి వినతి పత్రం ఇచ్చింది మెగా క్లస్టర్ ఏర్పాటుకా, మినీ క్లస్టర్ ఏర్పాటుకా..? మైక్రో క్లస్టర్ ఏర్పాటుకా..? అసలు నో క్లస్టర్ ఏర్పాటుకా..? ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం యార్న్ డిపోకు సంబంధించిన స్కీమ్‌ను మూడేళ్ల క్రితం ఎత్తివేసిందని, గత ఐదేళ్ల టర్మ్‌లో స్కీం ఉన్నప్పుడు యార్న్ డిపో ఏర్పాటు విషయం ఎందుకు మరిచిపోయారని ప్రశ్నించారు. సిరిసిల్ల నేత కార్మికుల సంక్షేమం కోసం టెక్స్ టైల్ మేనేజర్‌తో ఒక్కసారైనా సమావేశం నిర్వహించారా..? అసలు సిరిసిల్ల టెక్స్‌టైల్ మేనేజర్‌ను సంప్రదించకుండానే, ప్రతిపాదనలు తయారు చేయకుండానే ఇచ్చిన వినతి పత్రమా..? స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు బిల్లుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, త్వరలోనే దానికి సంబంధించిన జీఓ విడుదలవుతుందని పేర్కొన్నారు. టెక్స్‌టైల్ మంత్రితో మాట్లాడి వస్త్ర పరిశ్రమ పెద్ద మీద 90 శాతం సబ్సిడీతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్లాంట్లను సిరిసిల్లలో ఒక్క పవర్ లూమ్ పరిశ్రమంలోనైనా పెట్టించే దిశగా బండి సంజయ్ ఆలోచన చేస్తే విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ఉండేది కాదన్నారు. ఆయన చేతకానితనం వల్ల హ్యాండ్లూమ్ టెక్నాలజీ సెంటర్ గత ఐదేళ్లలో ఏర్పాటు కాలేదని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ఇటీవలే ప్రారంభించారని తెలిపారు. దీనివల్ల ప్రతి సంవత్సరం 60 మంది యువకులకు టెక్స్ టైల్ టెక్నాలజీ హ్యాండ్లూమ్ డిప్లొమా కోర్సులో ట్రైనింగ్ అండ్ ఓరియంటేషన్ ఇవ్వనున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గత మూడేళ్ల క్రితం యార్న్ డిపోకు సంబంధించిన పథకం రద్దు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం నేత కార్మికులు యార్న్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నదని వివరించారు. ఇప్పటికైనా బండి సంజయ్ ఉత్తుత్తి మాటలు బంద్ చేసి చేనేత కార్మికుల సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. తమ ప్రభుత్వం సిరిసిల్ల నేత కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నదని, రైతులకు రుణమాఫీ చేసినట్లే చేనేత కార్మికులకు రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు ఉన్నారు.

ఎస్ఐల పాసింగ్ ఔట్ పరేడ్‌లో తల్లితో ఎస్ఐ లక్ష్మణ్

## తల్లి మురిపెం..

కొడుకు ఎస్ఐ కావడంతో సంతోషం

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబర్11: ఎస్ఐ అయిన కొడుకును చూసి ఆ తల్లి మురిసిపోయింది. ఇన్నాళ్లు పడిన కష్టాన్ని ఫలితం దక్కిందని సంబురపడింది. కొడుకు బ్యాడ్జి పెట్టి ఆనందం వ్యక్తం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన వేముల లక్ష్మణ్‌కు ఇటీవల ఎస్ఐ జాబ్ వచ్చింది. హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీస్ ట్రైనింగ్ అకాడమీలో బుధవారంతో ఆయన శిక్షణ పూర్తి చేసుకున్నాడు. ఉన్నతాధికారులు లక్ష్మణ్‌కు అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చారు. ఈ క్రమంలో ఎస్ఐ అయిన కొడుకును చూసి తల్లి, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా, లక్ష్మణ్ ఇదివరకు కరీంనగర్, సిరిసిల్లలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించాడు. కష్టపడి చదివి ఎస్ఐ కొలువుకొట్టాడు.

## నిమజ్జనం సజావుగా సాగాలి

- నగర కమిషనర్ చాహాత్‌బాజ్‌పాయ్

మానకొండూర్, సెప్టెంబర్ 11: మానకొండూర్ పెద్దచెరువులో నిర్వహించే వినాయక విగ్రహాల నిమజ్జనం సజావుగా సాగాలని కరీంనగర్ నగర కమిషనర్ చాహాత్‌బాజ్‌పాయ్ సూచించారు. బుధవారం మానకొండూర్ పెద్దచెరువును సందర్శించి నిమజ్జన ఏర్పాట్లపై, నగర పాలక సంస్థ అధికారులకు పలుసలహాలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఈఈ రొడ్డ యాదగిరి, ఎస్ఈ రాజ్‌కుమార్, డీఈ లచ్చిరెడ్డి, అయూబ్‌ఖాన్, ఏఈ గఫార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీతో భవిష్యత్‌కు భరోసా

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 11 : విద్యార్థుల భవిష్యత్తుకు ఎన్‌సీసీ ఒక భరోసా అని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ – ఎయిర్ కమెడోర్ వీ మధుసూధన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం 9(టీ) బెటాలియన్, ఎస్ఆర్ఆర్ ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాలలను సందర్శించారు. బెటాలియన్ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కెడెట్లకు జ్ఞాపికలు అందజేశారు. శిక్షణ శిబిరాలు, కెడెట్లకు కావాల్సిన శిక్షణ మెలకువల గురించి అధికారులతో, ఆర్మీ అధికారులతో చర్చించారు. ఇక్కడ గ్రూప్ కమాండర్ సునిల్ అబ్రహం, 9(టీ) బెటాలియన్ కో కల్నల్ డేనియల్ లాట్‌జమ్, ఏఓ రాజేశ్వర్ జేశ్వాల్, ఎస్ఎం సాగర్ సింగ్, ఏఎన్‌ఓలు కెప్టెన్ రెల్ల సంజీవ్, మేజర్ రవీంద్ర బాబు, కెప్టెన్ కిరణ్ జ్యోతి, లెఫ్టినెంట్ పీ రాజు ఉన్నారు.

## విద్యాశాఖపై నిర్లక్ష్యమెందుకు?

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 11: విద్యాశాఖపై నిర్లక్ష్యం తగదని, సీఎం రేవంత్ వద్దే ఉన్న ఆ శాఖలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా వీసీ పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయని అసహనం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారాపు వెంకటేష్, మచ్చ రమేశ్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్ పాల్గొన్నారు.

## నేటి నుంచి యూఎస్ఎఫ్ఐ సమావేశాలు

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 11: భారత్ ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్ఎఫ్ఐ) కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నుంచి నిర్వహించే రాష్ట్ర సమావేశాలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తాటికొండ రవి, మాదం తిరుపతి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మూడు రోజులపాటు జరిగే సమావేశాల్లో విద్యారంగంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభించాల్సిన విధానాలపై చర్చిస్తామని, గురువారం జరిగే ర్యాలీ, బహిరంగ సభకు విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఇక్కడ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోత్ రాజేశ్ నాయక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో పత్తికి గరిష్ట ధర

జమ్మికుంట, సెప్టెంబర్ 11: జమ్మికుంట పత్తి మార్కెట్‌లో ఈ వానాకాలం సీజన్‌లో పత్తికి గరిష్ట ధర పలికింది. వారం రోజులుగా నిలకడగా ఉన్న పత్తి ధరలు బుధవారం అమాంతం పెరిగాయి. క్వింటాల్‌కు రూ.7800 ధరకు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేయగా, రైతులు సంబురపడ్డారు. అంతర్జాతీయ మార్కెట్లో పత్తిగింజలకు, పత్తి బేళ్లకు డిమాండ్ పెరిగిన కారణంగానే పత్తి ధరలు పెరిగినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

## పడేసిన బ్లూచిప్

### సెన్సెక్స్ 398, నిఫ్టీ 122 పాయింట్ల పతనం

ముంబై, సెప్టెంబర్ 11: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజు నష్టాలోకి జారుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లు కుప్పకూలడంతో ప్రారంభంలో లాభపడిన సెన్సెక్స్ చివర్లో భారీగా నష్టపోయింది. అటు నిఫ్టీ తన 25 వేల మార్క్ దిగువకు పడిపోయింది. టాటా మోటర్స్, రిలయన్స్, ఎల్ అండ్‌టీ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు నష్టాలవైపు నడిపించాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 398.13 పాయింట్లు కోల్పోయి 81,523.16 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 122.65 పాయింట్లు కోల్పోయి 24,918.45 వద్ద ముగిసింది. 30 షేర్ల ఇండెక్స్‌లో టాటా మోటర్స్ అత్యధికంగా 6 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్, ఎల్‌అండ్‌టీ, ఎస్బీఐ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ కూడా నష్టపోయాయి. కానీ, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యూఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్‌లు మాత్రం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 70 డాలర్ దిగువకు పడిపోయినప్పటికీ ఆసియా మార్కెట్లలో కరెక్షన్ జరిగిందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. చైనా ఆర్థిక వ్యవస్థ మందగిస్తున్నదన్న వార్తలు మార్కెట్ సెంటిమెంట్‌ను నిరాశపరిచిందన్నారు. రంగాలవారీగా ఆయిల్ అండ్ గ్యాస్ 2.25 శాతం, మెటల్ 1.35 శాతం, యుటిలిటీ 1.29 శాతం, ఆటో 1.17 శాతం, కమోడిటీస్ 1.14 శాతం, టెలికం రంగ షేర్లు కుదేలయ్యాయి.

వాణిజ్య

# మేకిన్ తెలంగాణే లక్ష్యం

ఏఐని అందరికీ అందుబాటులోకి తేవాలి • రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాన్ని ఉత్పాదక రంగంలో అగ్రగామిలా నిలిపేలా 'మేకిన్ తెలంగాణ' భావనను పెంపొందించాల్సిన అవసరం ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పారిశ్రామిక రంగానికి పిలుపునిచ్చారు. దేశీయ మార్కెట్‌లో తెలంగాణ ఉత్పత్తులకు ఆదరణ ఉండేలా నాణ్యతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) హైదరాబాద్ చాప్టర్ 38వ వార్షిక సదస్సును బేగంపేటలోని ఓ హోటల్‌లో ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. పరిమాణంపైనే కాకుండా నాణ్యతకు ప్రాధాన్యతనిస్తే దేశమంతా మనవైపు చూస్తుందన్నారు. ఇక ఉద్యోగుల సృజనాత్మకతను వెలికి తీసి ఆయా రంగాల్లో ఉత్పాదకతను పెంచేందుకు క్వాలిటీ ఫోరం చేస్తున్న కృషిని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. 'క్యాంపస్ టు కార్పొరేట్' అనే మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించడం ప్రశంసనీయమని కొనియాడారు. క్వాలిటీ సర్కిల్ శిక్షణ కార్యక్రమాలకు సహకరించిన ఈసీఐఎల్, ఎన్ఎండీసీ, ఆర్టీసీ, థర్మోపాడ్స్, థర్మోకేబుల్స్, ఉషా ఇంటర్నేషనల్, టాటా గ్రూప్, రేణుకా ప్లాస్టిక్, తోషిబా, రామ్‌కో, కెసీపీ సిమెంట్స్, హెఏఎల్, మిథాని, బీఈఎల్ సంస్థలకు ఈ సందర్భంగా మంత్రి ప్రోత్సాహకాలు అందజేశారు.

క్యూసీఎఫ్ఐ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

### కృత్రిమ మేధను ప్రోత్సహిస్తాం

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఏఐ)ను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రోజువారీ కార్యక్రమాల్లోనూ ఏఐ భాగమైపోయిందని, దీనిని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తగిన విధానాలతో ముందుకుపోతోందని చెప్పారు. ఇందులో భాగంగానే విద్యార్థుల భవిష్యత్ అవసరాలు తీర్చేలా స్కిల్డ్ వర్కిటీల ఏర్పాటుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఏఐ వినియోగంపై ఉద్యోగులు, కార్మికులు, పరిశ్రమ ప్రతినిధులకు అవగాహన కల్పిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫోరం జాతీయ చైర్మన్ శ్యామ్ మోహన్, హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ బాలకృష్ణరావులు కూడా మాట్లాడారు.

## 2 రోజుల్లో 1,000 అప్

### మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11: బంగారం మళ్లీ ప్రియమవుతున్నది. ప్రస్తుత పండుగ సీజన్‌కావడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీంతో గడిచిన రెండు రోజుల్లో పుత్తడి ధర రూ.1,000 ఎగబాకింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం ధర మరో రూ.500 పెరిగి రూ.74,600 పలికింది. అంతకుముందు ఈ ధర రూ.74,100గా ఉన్నది. బంగారంతోపాటు వెండి కూడా పరుగులు పెట్టింది. పారిశ్రామికవర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ ఉండటంతో కిలో వెండి రూ.500 అధికమై రూ.85 వేలకు చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లో 22 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.380 అధికమై రూ.67,150కి చేరుకోగా, 24 క్యారెట్ ధర రూ.410 ఎగబాకి రూ.73,250కి చేరుకున్నది. అలాగే కిలో వెండి రూ.500 ఎగబాకి రూ.91,500 పలికింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ ధర 2,550.90 డాలర్లు పలుకగా, వెండి 29.11 డాలర్లకు చేరుకున్నది.

# మళ్లీ భారత్‌కు ఫోర